



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్

కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి

రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక ఎంపీ స్థానాలు

మోదీ నిర్ణయాల వల్లే పసుపునకు అత్యధిక ధర : ఎంపీ అర్వింద్

నిజామాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాని కానున్నారని ఎంపీ అర్వింద్ అన్నారు. నిజామాబాద్ బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రజలు ఎప్పుడో డిసైడ్ అయ్యారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే అధికారం ఖాయమని అన్నారు. అన్ని నియోజకవర్గాల పరిధిలో సీట్ల కోసం ఎక్కువ మంది ప్రయ త్నాలు చేస్తున్నారని అన్నారు. ఉత్తర భారతంలో కాంగ్రెస్‌కు నామ మాత్రం సీట్లు కూడా రావన్నారు. రాష్ట్రంలో బీజేపీకి పది సీట్లకు పైగా వస్తాయన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి ఓటు బ్యాంక్ భారీగా పెరిగిందన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగానే ఇది సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రెండో స్థానం, బీఆర్‌ఎస్‌కు మూడో స్థానం దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం వేల కోట్ల రూపాయలను గ్రూపులకు అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాండ్స్ ఇవ్వకపోవడం వల్ల వారికి పావలా వడ్డీ రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగు ణంగానే నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు ధరలు పెరుగుతు న్నా యన్నారు. రెండేళ్లుగా స్పైస్ బోర్డు తీసుకున్న నిర్ణయాల వల్ల ఈ ధర పెరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు ప్రారంభం

పెద్దబజార్, ఫిబ్రవరి 13: ఇందూరు నుంచి అయోధ్యకు బయలుదేరే ప్రత్యేక రైలు 'ఆస్తా'ను జెండా ఊపి ఎంపీ అరవింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక ట్రైన్ ఆస్తా సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుండగా పార్లమెంట్ పరిధిలో 1344 మంది భక్తులు ఉండటంతో వారికి ఇబ్బంది కాకుండా ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ ప్రత్యేక చొరవ తీసుకొని నిజామాబాద్ నుంచి వెళ్లేందుకు వీలుగా భక్తులకు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ అయోధ్య ట్రస్ట్ కో కన్వీనర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్‌గుప్త ట్రస్ట్ ద్వారా నిజామాబాద్ పార్లమెంట్ నుంచి వెళ్లే భక్తులందరికి భోజనం, వాటర్ బాటిల్స్ అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు ఆకుల హేమలత శ్రీనివాస్, చుక్క మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలపై ప్రధాన పార్టీల నజర్



- సామాజిక వర్గాల ఆధారంగా గెలుపు గుర్రాల కోసం కసరత్తు
- బలమైన అభ్యర్థులకే అవకాశం ఇవ్వనున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్
- బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌కు దాదాపు ఖరారైన టికెట్
- ఈ నెల నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టనున్న పార్టీల నేతలు

నిజామాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ నుంచి బలమైన అభ్యర్థులను బరిలో దించేందుకు కాం గ్రెస్, బీఆర్ ఎస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. సామాజిక వర్గాల ఆధారంగా గెలుపు గుర్రాలను బరిలో దించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దఫా ఈ రెండు పార్టీలు ఈ సీటుపై కన్నేయగా సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీ నియోజకవర్గం పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అన్ని సంఘాలను ఏకం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సీట్‌పై కన్నేసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు. ఎవరికి వారే సామాజిక వర్గాలను తెరపైకి తెస్తున్నారు. అధిష్ఠానాలను కలుస్తూ తమవర్గం వారికి సీట్లు ఇవ్వాలని కోరుతున్నారు.

త్వరలో ఎన్నికల షెడ్యూల్

పార్లమెంట్‌కు ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్ రానుండడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో పోటీ పడే నేతలు గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల లిస్టు, సామాజిక వర్గాల ప్రభావం బట్టి ఆ నేతలు ఈసీటుపై దృష్టిపెట్టి టికెట్ కోసం ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ పార్లమెంట్‌కు అభ్యర్థుల ఎంపిక కోసం మూడు పార్టీల నేతలు పలుదఫాలు సర్వేలు నిర్వహించారు. పార్లమెంట్‌లో ఏ అభ్యర్థికి టికెట్ ఇస్తే గెలుపు అవకాశాలు ఉన్నాయో పరిశీలించారు. ఏ వర్గం ఓటర్లు ఎటువైపు మొగ్గుతున్నారో, ఏ అంశాలు వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయో ఈ సర్వేల ద్వారా ఆయా పార్టీల నేతలు ఫీడ్ బ్యాక్ తీస్తున్నారు. వాటి ఆధారంగానే బలమైన సామాజిక వర్గాల అభ్యర్థులకు టికెట్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యర్థులను నిర్ణయిస్తున్నట్లు సమాచారం.

సిట్టింగ్ ఎంపీవైపే బీజేపీ చూపు

నిజామాబాద్ పార్లమెంట్ నుంచి సిట్టింగ్ ఎంపీగా బీజేపీకి చెందిన ఎంపీ అర్వింద్ ఉన్నారు. ఈ ఐదేళ్ల పదవీ కాలంలో ఇచ్చిన హామీల్లో భాగంగా పసుపుబోర్డు తీసుకురావడం, మున్సిపాలిటీలో సీట్లు సాధించడం, శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో రెండు సీట్లను గెలవడం వల్ల ఆయన గ్రాఫ్ పెరిగింది. శాసనసభ ఎన్నికల్లో ఆయన కొరుట్ల నుంచి ఓడిపోయినా పార్లమెంట్ పరిధిలో భారీగా ఓట్లు రావడం వల్ల అధిష్ఠానం రెండోదఫా కూడా ఆయనకే దాదాపు సీటు ఖరారు చేసినట్లు తెలిసింది. సీట్ల కోసం మిగతా జిల్లాలకు పరిశీలకులను పంపినా సికింద్రాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌కు ఎవరిని నియమించక పోవడం వల్ల వీరికి దాదాపు ఖరారైనట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలుస్తోంది. కొంతమంది నేతలు బీజేఈ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం ఉండదని ఆ పార్టీ నేతలు తెలిపారు. ఎన్నికల సమయంలో పార్టీ క్యాడర్ కూడా ఎలాంటి వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎంపీ అర్వింద్‌కు సీటు దాదాపు ఖరారు కావడంతో ఆయన పలు కార్యక్రమాలను ప్రచారం రీతిలోనే కొనసాగిస్తున్నారు. అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తూ అన్ని సంఘాలను దగ్గర చేసుకునే ప్రయత్నం చేస్తూ సీనియర్ నేతలతో కలిసి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్‌లో పోటాపోటీ

నిజామాబాద్ పార్లమెంట్ సీటు కోసం కాంగ్రెస్‌లో మాత్రం గట్టి పోటీ నెలకొంది. రాష్ట్రంలో అధికారంలో ఉండడం, శాసనసభ ఎన్నికలై రెండు నెలలే కావడంతో తమకు అనుకూలిస్తుందని భావిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని రెడ్డి, బీసీ నేతలు ఎక్కువగా ప్రయత్నా లు చేస్తున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మె ల్సీలు నర్సారెడ్డి, ఆకుల లలిత, బాల్కొండ నుంచి పోటీ చేసిన సునీల్‌రెడ్డి, సినీ నిర్మాత దిల్‌రాజుతో పాటు మరికొంతమంది నేతలు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్‌లో సీనియర్ అయిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. రైతు నేత కావడం, పార్లమెంట్ పరిధిలో వారే ఎక్కువగా ఉండడం వల్ల కలిసివస్తుందని భావిస్తున్నారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన అరికెల నర్సారెడ్డి గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. తనకు పార్టీలో ఉన్న నేతలతో పాటు జాతీయస్థాయి నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. లాబీయింగ్ భారీగా చేస్తున్నారు. బీసీ కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో బీసీలు ఎక్కువగా ఉండడం వల్ల కలిసివస్తుందని అధిష్ఠానానికి వివరిస్తున్నారు. వీరితోపాటు బాల్కొండకు చెందిన సునీల్‌రెడ్డి ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. సినీ నిర్మాత దిల్‌రాజు మాత్రం హైదరాబాద్‌లో నేతలను కలుస్తున్నారు. పార్లమెంట్ సీటు నుంచి పోటీ చేసే అభ్యర్థులను ఏఐసీసీ నిర్ణయించనుండటంతో జాతీయ స్థాయి నేతలను కూడా కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ఎక్కువ సీట్లను గెలుచుకోవడం పార్టీకి తప్పనిసరి కావడంతో రాష్ట్రంలో కూడా అత్యధిక సీట్లపై దృష్టి పెట్టిన పార్టీ నేతలు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. గెలిచే వారికే ఈ దఫా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇతర నేతలకు రాష్ట్రస్థాయిలో పదవులను ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. వారికి కార్పొరేషన్ పదవులు కానీ వచ్చే ఎమ్మెల్సీల ఖాళీలలో కానీ సర్దుబాట్లు చేసే అవకాశం ఉందని జిల్లాకు చెందిన నేతలు తెలిపారు. గత పదేళ్ల పార్టీ కోసం పనిచేసి అసంతృప్తిగా ఉన్న నేతలకు కూడా కార్పొరేషన్ పదవులు జిల్లాలో నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యేల వైపు బీఆర్‌ఎస్ చూపు

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్‌కు ఈ దఫా పార్లమెంట్ సీట్లు గెలుచుకోవడం తప్పనిసరి అయింది. రాష్ట్రంలో రాజకీయాలను తట్టుకోవడంతో పాటు పార్టీని కాపాడుకునేందుకు కేంద్రంలో ఎంపీలు ఎక్కువగా ఉంటే ఉపయోగం ఉండనుండడంతో వారు కూడా ఈ సీట్లపై నజర్ పెట్టారు. గతంలో కోల్పోయిన నిజామాబాద్ సీటును తిరిగి సాధించుకునేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ దఫా ఎంపీగా మాజీ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలోని నేతలందరు కలిసికట్టుగా పనిచేసి సీటు గెలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్ గుప్త, ఎన్ఆర్ఐ మహేష్ బిగాలతో పాటు ఇతర అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. షెడ్యూల్‌కు ముందే అభ్యర్థిని నిర్ణయించి నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మూడు పార్టీల నేతలు అభ్యర్థుల ఎంపిక ఎన్నికల షెడ్యూల్ లోపే చేయనున్నారు.



మండల అధికారులకు పోస్టింగులు

- జిల్లాకు వచ్చిన తహసీల్దార్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చిన కలెక్టర్
- ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇచ్చిన జడ్పీ సీఈవో

నిజామాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు, ఎంపీడీ వోలకు పోస్టింగ్‌లను ఇచ్చారు. వారికి ఆయా మండలాలను కేటాయించారు. మల్టీజోన్ పరిధిలో తహసీల్దార్లను బదిలీ చేయగా జిల్లాకు కొత్త వారిని నియమించారు. వారందరికి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఈ పోస్టింగ్‌లను ఇచ్చారు. జిల్లా పరిషత్‌లో కేటాయించిన ఎంపీడీవోలకు సీఈవో పోస్టింగ్‌లను కేటాయించారు.

20 మంది తహసీల్దార్ల నియామకం

జిల్లాకు బదిలీపై వచ్చిన 20 మంది తహసీల్దార్లకు కలెక్టర్ పోస్టింగ్‌లను ఇచ్చారు. కొంత మంది జిల్లాలో పనిచేస్తున్న వారిని కూడా ఇతర మండలాలకు కేటాయించారు. జిల్లాకు వచ్చిన కె.శ్రీలతను భీంగల్ తహసీల్దార్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న వెంకటరమణను డొంకేశ్వర్ తహసీల్దార్‌గా నియామకం చేశారు. డొం కేశ్వర్ తహసీల్దార్ రామును ఎస్సారెస్పీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మోస్రా తహసీల్దార్ శ్రీకాంత్‌రావును కలెక్టరేట్ ఎలక్షన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా నియమించారు. రేంజల్ తహసీల్దార్ రాంచందర్‌ను కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా నియామకం చేశారు. జిల్లాకు వచ్చిన బి.సరితను వేల్పూర్ తహసీల్దార్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న నాగార్జునను నిజామాబాద్ నార్త్ తహసీల్దార్‌గా నియామకం చేశారు. అక్కడి తహసీల్దార్ మారుతిని మోస్రా తహసీల్దార్‌గా నియమించారు. జక్రాన్‌పల్లి తహశీల్దార్ ఖలీంను రేంజల్ తహసీల్దార్‌గా నియామకం చేశారు. నవీపేట తహసీల్దార్ ధన్‌వాల్‌ను ఎడపల్లికి బదిలీ చేశారు. వర్ని తహసీల్దార్ నారాయణను నవీపేటలో నియామకం చేశారు. ఆర్మూర్ తహసీల్దార్ శ్రీకాంత్‌ను ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో నియమించారు. జిల్లాకు వచ్చిన తహశీల్దార్ గజానన్‌ను ఆర్మూర్ తహసీల్దార్‌గా నియామకం చేశారు. సాలూరా తహసీల్దార్ మల్లయ్యను పో తంగల్‌కు బదిలీ చేశారు. నిజామాబాద్‌కు వచ్చిన డి.కిరణ్మయిని జక్రాన్‌పల్లికి నియమించారు. డిచ్‌పల్లి తహశీల్దార్ రాజేందర్‌ను నిజామాబాద్ ఆర్డీవో కేంద్రంలో నియామకం చేశారు. మోపాల్ తహసీల్దార్ ఖాజా కుతుబుద్దీన్‌ను ఆర్డీవో బోధన్ కార్యాలయంలో నియామకం చేశారు. కోటగిరి తహసీల్దార్ ప్రభాకర్‌ను డిచ్‌పల్లికి బదిలీ చేశారు. జిల్లాకు వచ్చిన జి.సునీతను కోటగిరి తహసీల్దార్‌గా నియమించారు. ఎడపల్లి తహసీల్దార్ మోతిసింగ్‌ను వర్ని తహసీల్దార్‌గా నియామకం చేశారు.

ఎంపీడీవోల నియామకం

ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలకు కూడా జీడ్పీ సీఈవో గోవింద్ పోస్టింగ్‌లను ఇచ్చారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన ఎంపీడీవో బి.తిరుమలను మోర్తాడ్‌కు నియామకం చేశారు. జగిత్యాల నుంచి వచ్చిన రాజా శ్రీనివాస్‌ను కమ్మర్‌పల్లి, వెంకటేశ్ జాదవ్‌ను బోధన్, జి.సంతోష్‌కుమార్‌ను భీంగల్ ఎంపీడీవోలుగా నియమించారు. కామారెడ్డి నుంచి వచ్చిన జి.వెంకటేశ్వర్‌ను వర్ని, ఎ.బాలకృష్ణను ధర్పల్లి, ఎ.అనంత్‌రావును ఇందల్వాయి, ఎం.సతీష్‌కుమార్‌ను మాక్లూర్, ఎం.శంకర్‌ను ఎడపల్లి, ఎ.బాలకిషన్‌ను వేల్పూర్ ఎంపీడీవోలుగా నియామకం చేశారు. మెదక్ నుంచి వచ్చిన ఎంపీడీవో ప్రవీణ్‌ను మోస్రాకు నియమించారు. నిర్మల్ నుంచి వచ్చిన బి.శ్రీనివాస్‌రావును నందిపేట్‌కు, ఎం.వెంకటేశ్వర్లను ఏర్గట్లకు, ఏ.నాగనాథ్‌ను నవీపేట్‌కు, టి.సాయిరాంను ఆర్మూర్‌కు, వి.వనజను మెండోరాకు, టి.సురేష్ బాబును రుద్రూర్‌కు, విజయభాస్కర్ రెడ్డిని బాల్కొండకు ఎంపీడీవోలుగా నియమించారు. సంగారెడ్డి నుంచి వచ్చిన రవీందర్‌ను డిచ్‌పల్లికి, ఎండీ ముజఫర్ ఉద్దీన్‌ను ము ప్కాల్ ఎంపీడీ వోగా నియామకం చేశారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో అవగా హన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారికి, హస్తకళ కళాకా రులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సమీకృతజిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఎంఎస్ ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్తంగా జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిలుగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం ఉద్దేశాలను, ప్రయోజనాలను వివరిస్తూ అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమ్మరులు, స్వర్ణకారులు, కుమ్మరులు, వడ్రంగులు, శిల్పులు, చేతివృత్తుల వారు, హస్తకళాకారులు వంటివి 18 కేటగిరిలలో పని చేస్తున్నవారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు. వడ్రంగులు, పడవల తయారీదారులు, కమ్మరులు, తాళాల తయారీదారులు, బంగారం, వెండి ఆభరణాల పనిచేసే వారు, శిల్పులు, చర్మకారులు, తాపీపని వారు, చీపురు తయారీదారులు, రజకులు, దుస్తులు కుట్టే దర్జీలు, చేపల వలలు తయారు చేసేవారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి నైపుణ్యం మెరుగుదల కోసం 7 నుంచి 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ కాలంలో రోజుకు 500లు, ధ్రువీకరణపత్రం, గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. వృత్తిపరికరాలు సమకూర్చుకునేందుకు వీలుగా టూల్‌కిట్ కోసం 15 వేల ఆర్థిక సహాయం అందిస్తారని లబ్ధిదారులు నామమాత్రంగా కేవలం 5 శాతం వడ్డీపై రుణసదుపాయం పొందవచ్చన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ తేదీ నాటికి 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని గత ఐదేళ్లలో స్వయం ఉపాధి/వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రుణాలు పొందిన వారు ఈ పథకానికి అనర్హులన్నారు. ముద్ర, స్వనిధి పథకాల లబ్ధిదారులు తమ రుణాలను చెల్లించిన ట్లయితే ఈ పథకానికి అర్హులన్నారు. ఒక కుటుంబంలో ఒకరికే ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వ సర్వీసులో ఉన్న వ్యక్తికి/ కుటుంబ సభ్యులకు ఈ పథకం వర్తించదని ఆయన తెలిపారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్, ఎంఎస్‌ఎంఈ అధికారి రాజేష్ యాదవ్, బీసీ సంక్షేమ అధికారి రమేష్, సిద్ధయ్య, సీఎస్‌ఈ జిల్లా మేనేజర్ గౌతం, పంచాయతీ కార్యదర్శులు, విశ్వకర్మలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

ఖిల్లా, ఫిబ్రవరి 13: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలే ప్రధానమని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని మేఘన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ ఆధ్వర్యంలో ఓరల్ అండ్ మ్యాక్సో ఫేషియల్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మంగళవారం ట్రాఫిక్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని సీపీ కల్మేశ్వర్ సింగనెవార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువత దేశ భవిష్యత్తు అలాంటి యువత రోడ్డు ప్రమాదాల బారిన పడి మంచి భవిష్యత్తును కోల్పో కూడదని సూచించారు. వాహనాలు నడిపేవారు తప్పకుం డా లైసెన్సు తీసుకోవాలని రోడ్డు ప్రమాదాల నుండి దూ రంగా ఉండాలని అన్నారు. యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని, చట్టాలను గౌరవించి వాటిని పాటించాలని తెలిపారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసు కుంటుందన్నారు. అయినప్పటికీ ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ప్రమాదాల నివారణ కోసం వాహ నదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.జయరాం, ట్రైనీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి, ఏసీపీలు ఎం.కిరణ్‌కుమార్, టి.నారాయణ, అరుణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకట్‌నారాయణ, ట్రాఫిక్ ఆర్ఐ సతీష్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ అమర్‌నాథ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సాయిచంద్, రమణరావు, వర్షనిహంత్ (ఐరాడ్ మేనేజర్), పాల్గొన్నారు. కాగా, రోడ్డు ప్రమాదాలు ఏ విధంగా జరుగుతున్నాయో నృత్య ప్రదర్శన ద్వారా మేఘన డెంటల్ కాలేజీ విద్యార్థినులు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

- ర్యాలీలో పాల్గొన్న జడ్జి, సీపీ, తదితరులు



నేడు వసంత పంచమి

- బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఘనంగా ఏర్పాట్లు



నవీపేట, ఫిబ్రవరి 13: జిల్లా సరిహద్దున గల నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రం వసంతోత్సవం సందర్భంగా కళకళలాడుతోంది. బుధవారం అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి పర్వదినం కావడంతో.. ఆలయాలన్నింటినీ రంగురంగులా పువ్వులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వసంత పంచమి శుభదినాన అక్షరాభ్యాస పూజలు జరిపించేందుకు భక్తులు తరలొచ్చారు. మంగళవారం సాయంత్రానికే పుణ్య క్షేత్రంలోని ప్రైవేటు దేవస్థాన సత్రాలన్నీ భక్తులతో నిండి పోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ఉదయం 3 గంటల నుంచే అక్షర శ్రీకార పూజలు జరిపించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

'పసుపు రైతులూ.. సూచనలు పాటించండి'

ఖిల్లా, ఫిబ్రవరి 13: నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చే రైతులు కింద పేర్కొన్న సూచనలు పాటించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు సీజన్ ప్రారంభం కావడంతో పసుపు అధిక మొత్తంలో మార్కెట్‌కు వస్తుందన్నారు. ఉదయం 6 నుంచి 10గంటల వరకు వచ్చే పసుపును మాత్రమే యార్డులోకి అనుమతిస్తామని, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పసుపును తీసుకురావాలన్నారు. విన్నర్ లిస్ట్ 5వేల బస్తాల వరకు ఉన్నట్లయితే 2గంటల వరకు, 10వేల బస్తాలు ఉన్నట్లయితే 3గంటల వరకు, 15వేల బస్తాలు ఉన్నట్లయితే 4గంటల వరకు ప్రకటిస్తామన్నారు. 16వ తేదీన కార్మికుల సమ్మె కారణంగా యార్డులో ఎలాంటి లావాదేవీలు జరగవన్నారు. 17న జనరల్ బీట్ మాత్రమే జరుగుతుందని పసుపు కొనుగోలు ఉండదన్నారు. 18న ఆదివారం కావడంతో సెలవు దినమని, 19వ తేదీ నుంచి పసుపు లావాదేవీలు యధా విధిగా ఉంటాయని పేర్కొన్నారు.

● పసుపునకు రూ.13వేల 666

పసుపునకు మంగళవారం 13వేల 666 రూపాయల ధర లభించిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు. 6 వేల 63 క్వింటాళ్ల పసుపు మార్కెట్‌కు వచ్చిందని వారు ఈ సందర్భంగా తెలిపారు.



● చిన్నాపూర్ గ్రామంలో డ్రైనేజీలలో స్ప్రే చేస్తున్న దృశ్యం

రోడ్లు, మురికి కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలి

● నిజామాబాద్ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, ఫిబ్రవరి 13: గ్రామాలలో రోడ్లు, మురికికాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీలో మురికినీరు నిల్వకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు ట్యాంకులలో క్లోరినేషన్ వేస్తూ శుభ్రపర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, ప్రత్యేక అధికారిణి ముత్తెన్న, ఎంపీటీసీ సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలించిన జిల్లా అధికారి

వర్ని,ఫిబ్రవరి 13: మండలంలోని తగిలేపల్లి గ్రామ శివారులో పంట నమోదు ప్రక్రియను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత రాకుండా ఫైప్స్ అనే యాప్ ద్వారా మండలంలో గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల అమ్మకం, స్టాక్ నిల్వలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎరువుల డీలర్లు అందరు ఈపీవోఎస్ మెషిన్ ద్వారా మాత్రమే రైతులకు యూరియా విక్రయించాలని అన్నారు. రైతులు అధిక యూరియా వాడకం వల్ల పంటకు ఎక్కువగా తెగుళ్లు ఆశించి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందులో ఏవో నగేష్ రెడ్డి, ఏఈవో అరుణ్ పాల్గొన్నారు.

ఇరువర్గాలకు నోటీసుల అందజేత



ఇందల్వాయి, ఫిబ్రవరి 13: ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి తిర్మన్‌పల్లి శివారులో హైవే పక్కన గల వివాదాస్పద భూమి సర్వే నెంబర్ 728/20 భూమి కోర్టు కేసులో ఉన్నందున ఇరువర్గాల వారు ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు కానీ, కార్యక్రమాలు కానీ చేపట్టవద్దని మంగళవారం పోలీసులు ఇరువర్గాల మతపెద్దలకు నోటీసులు అందజేశారు. గత కొంతకాలంగా గిరిజనులు, ముస్లింలు ఈ భూమి కోసం పలు దఫాలు గొడవ పడినందున ప్రజాశాంతికి భంగం కలిగించే చర్యలను దృష్టిలో పెట్టుకొని శాంతిభద్రతల దృష్ట్యా ఈ భూమి కేసు కోర్టులో పరిష్కారం అయ్యేంత వరకు ఇరువర్గాల వారు అట్టి భూమిలోకి వెళ్లవద్దని నోటీసులు అందజేశారు. అంతేకాకుండా వివాదాస్పద భూమిని ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకుందని ఆర్‌డీవో జారీ చేసిన 145 సీఆర్‌పీసీ ప్రొసీడింగ్ కాపీ నోటీసులను ఇరువర్గాల పెద్దలకు అందించామని తెలిపారు. ఇట్టి వివాదాస్పద భూమి ప్రభుత్వ స్వాధీనంలోకి వెళ్లినందున ఎవరు కూడా ఆ భూమిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని అన్నారు. కోర్టు ఆదేశాలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మేడారం జాతరకు రీజియన్ నుంచి బస్సులు

● జాతరకు తరలనున్న సుమారు 270 బస్సులు ● వారం పాటు అందుబాటులో మిగిలిన బస్సులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: తెలంగాణ కుంభమేళ మేడారం జాతరకు నిజామాబాద్ రీజియన్‌కు చెందిన ఆర్టీసీ బస్సులు తరలివెళ్లనున్నాయి. తెలంగాణ ప్రాంతాల నుంచి మేడారం సమ్మక్క సారక్కలను దర్శించుకోవడానికి ప్రజలు భారీగా తరలనుండడంతో నిజామాబాద్ రీజియన్ బస్సులను ఇతర ప్రాంతాలకు తరలించనున్నారు. సుమారు 270బస్సులను ఇతర డిపోలకు తరలించనున్నారు. ఆదిలాబాద్ తదితర డిపోల నుంచి వీటిని ఆపరేట్ చేయనున్నట్లు నిజామాబాద్ రీజియన్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉండగా వీటిలో సుమారు 600కిపైగా బస్సులు నడుపుతున్నారు. ఇందులో 270పైగా బస్సులు మేడారం జాతరకు తరలిస్తుండడంతో ఇక్కడ ఉన్న బస్సులతో ప్రయాణాలు సాగించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారనుంది. ఈనెల 21 నుంచి 26 వరకు మేడారం జాతర ఉండడంతో నిజామాబాద్ రీజియన్ నుంచి 19వ తేదీనే బస్సులు ఇతర డిపోలకు తరలించనున్నారు. 26వ తేదీ వరకు బస్సులు అక్కడనే ఉండనున్నాయి. అప్పటి వరకు మిగతా బస్సులతోనే రీజియన్ వ్యాప్తంగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. వారం రోజులపాటు బస్సులు అందుబాటులోకి లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. ఉన్న బస్సులను సైతం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో నడపనున్నారు. దీంతోపాటు ట్రిప్పులను సైతం తక్కువచేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

● ఉచిత ప్రయాణంతో కిక్కిరిసిన మహిళలు

మహిళలకు ఉచిత ప్రయాణంతోనే బస్సులు కిక్కిరిసిపోవడంతో తలలు పట్టుకుంటున్న ఆర్టీసీ అధికారులకు మేడారం జాతరకు ఇతర డిపోలకు తరలించడం అదనపు భారంగా మారింది. దీనికి తోడు ఫిబ్రవరి నెల మొత్తం పెళ్ళిళ్ల సీజన్ ఉండడంతో ప్రయాణికుల రద్దీ సైతం ఎక్కువగా ఉండనుంది. వారం రోజులపాటు ఉన్న తక్కువ మొత్తం బస్సులతోనే ప్రయాణికులను చేరవేసేందుకు సమాయత్తం అవుతున్నారు. బస్సుల లేమితో ఆర్టీసీ అధికారులకు వారం రోజులపాటు ఇబ్బందిగా మారనుంది.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

నవీపేట,ఫిబ్రవరి13: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించనున్నారు.11సంవత్సరాల క్రితం వసంతపంచమి రోజున ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతిహోమం, అభిషేకం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కాకతీయ సత్తా

● 90 శాతానికి పైగా పర్సంటైల్ సాధించిన 17 మంది కళాశాల విద్యార్థులు



సుప్రీత్ అబ్దుల్ హదీ అబ్దుల్ మాలిక్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 : మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని కాకతీయ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం చదువుతూ ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే డైరెక్ట్‌గా ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులతో పాటు జిల్లా ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులను సాధించారు. ఎండీ మినహాజ్ 99.68 పర్సంటైల్‌తో జిల్లా ఫస్ట్, ఎం.సుప్రీత్ 99.41 పర్సంటైల్‌తో జిల్లా సెకండ్, బి.శివప్రతమ్ 99.22 పర్సంటైల్‌తో జిల్లా థర్డ్ ర్యాంకులను సాధించినట్లు విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. కళాశాలకు చెందిన అబ్దుల్ హదీ 98.22 పర్సంటైల్, అబ్దుల్ మాలిక్ 97.42 పర్సంటైల్, జె.కేతన 97.41 పర్సంటైల్, అనీష్ కుర్దుకర్ 97.01 పర్సంటైల్, టి.మణికాంత్ 94.65 పర్సంటైల్, ఇజాన్ తహామి 94.51 పర్సంటైల్, తాటిపల్లి రిషిక్ సాయి 94.48 పర్సంటైల్, అఖిలేష్ దూర్నాల 93.95 పర్సంటైల్, అజ్మీర తేజస్విని 93.50పర్సంటైల్, ఎం.లోకేష్ 93.34 పర్సంటైల్, వి.సాయివరుణ్ 92.39పర్సంటైల్, ఎన్.భార్గవ్ సాయి 91.63 పర్సంటైల్, టి.కౌషల్ 91.05 పర్సంటైల్, ఎండీ సయాద్ అలీ 90.48 పర్సంటైల్ సాధించడంతో పాటు 17 మంది కాకతీయ విద్యార్థులు 90 శాతంకు పైగా పర్సంటైల్‌ను సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఐఐటీ అడ్వాన్స్‌కు 50 మంది విద్యార్థులు అర్హతలు సాధించారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ జూనియర్ కాలేజీ డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు (ఐఐటీయన్) మాట్లాడుతూ.. జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించి తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటడంతో పాటు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని ఇందుకు కృషి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపక బృందానికి, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. 2022, 2023 జేఈఈ మెయిన్స్‌లోనూ కాకతీయ విద్యార్థులు జిల్లా మొదటి, రెండు, మూడవ స్థానాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ అధ్యాపక బృందం, ప్రిన్సిపల్స్ రణదీష్, సందీప్‌కులకర్ణి, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్, జ్యోత్స్న పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కి పునాది కేవోఎస్ స్కూల్ స్థాయిలోనే..

● మినహాజ్, 99.68 పర్సంటైల్



నేను జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో ఈస్థాయి పర్సంటైల్ సాధించేందుకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదవడం వల్లే సాధ్యమైంది. నేను పదవ తరగతి వరకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదివాను. ఇతర స్కూళ్లలో ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ పేరుతో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ప్రకటనలు పెట్టడంతో ఆ స్కూళ్లలో మా ఫ్రెండ్స్‌ని వారి తల్లిదండ్రులు చేర్పించారు. కానీ పేరు కే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ కోచింగ్ పేరుతో టైంపాస్ చేస్తూ నిజమైన ఐఐటీ మెడికల్ పై శిక్షణ ఇచ్చేవారు కాదు. ఈ ఫలితాలలో ఇతర స్కూళ్లలో చదివిన నా మిత్రులు క్వాలిఫై కాలేదు. నేను భవిష్యత్తు జాతీయ విద్యకు పక్కప్రణాళికలో ఉన్న కేవోఎస్ స్కూల్‌లో చదవడం వల్లే 99.68 పర్సంటైల్ వచ్చింది. ప్రతీ సబ్జెక్ట్‌పై ప్రతిరోజు మాకు ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై ఇంటర్ ఎంసెట్ స్థాయి లెక్చరర్స్‌తో స్కూల్ స్థాయిలోనే శిక్షణ ఇచ్చారు. దీనికి మా ఫౌండేషన్ డైరెక్టర్ రామోజీరావు కృషి ఎంతో ఉంది.

స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ/ మెడికల్ ఫౌండేషన్ శిక్షణ

● బి.శివప్రతమ్, 99.22 పర్సంటైల్



స్కూల్ స్థాయిలో ప్రతిరోజు ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై ఇంటర్ ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇప్పించడం వల్లే ఈ రోజు విడుదలైన ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 99.22 పర్సంటైల్ సాధించాను. నేను పదవ తరగతి వరకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదివాను. 6వ తరగతి నుంచే పాఠశాలలో ఐఐటీ జేఈఈ మెయిన్స్‌పై శిక్షణ ఇచ్చేవారు. స్కూల్ స్థాయిలో తల్లిదండ్రులు జాగ్రత్త పడి ఎక్కడైతే ఐఐటీ ఫౌండేషన్ బాగుంటుందో ఆ పాఠశాలలో చేర్పించాలి. ప్రతీ సబ్జెక్టుపై ప్రతిరోజు లెక్చరర్లు శిక్షణ ఇచ్చేవారు. మా స్కూల్ డైరెక్టర్ సీహెచ్ తేజస్విని ప్రణాళికలు, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయి మార్కులు సాధించాను.

నవీపేట ఎంపీడీవోగా నాగనాథ్

నవీపేట,ఫిబ్రవరి13:నవీపేట నూతన ఎంపీడీవోగా ఏ.నాగనాథ్ నియామకం అయ్యారు. గతంలో నవీపేట ఎంపీడీవో పని చేసిన సయ్యద్ సాజిద్ అలీ కామారెడ్డి జిల్లాకు బదిలీ కాగా నిర్మల్ జిల్లా బాసర ఎంపీడీవోగా పని చేసిన నాగనాథ్ నవీపేట ఎంపీడీవోగా నియామకం అయ్యారు.ఈమేరకు బుధవారం ఆయనపదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మంగళవారం అసిస్టెంట్ కమిష నర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్వర్‌రెడ్డిని మున్సిపల్ కమి షనర్ మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు. నిజామాబాద్ అసిస్టెంట్ కమి షనర్‌గా మాత్రం ఎవరినీ నియమించలేదు.

'కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తోంది'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13: నూతన జాతీయ విద్యావిధానంతో విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యను అందించకుండా కేంద్రప్రభుత్వం కాషాయీకరణ పెంచి పోషిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్‌మూర్తి అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. జాతీయ విద్యావిధానం ఓ విపత్తు లాంటిందని దీని నివారణకు ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్త ఉద్యమాన్ని నడిపించిందని గుర్తు చేశారు. అదేవిధంగా కేంద్రం రీసర్చ్ స్కాలర్ ఫెలోషిప్‌ల విషయంలో ప్రతీ సంవత్సరం కోత విధిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి 7.7 శాతం నిధులు అరకొరగా కేటాయించడం సరైందికాదన్నారు. వెంటనే కోఠారి కమిషన్ పేర్కొన్న రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు.మేథోశక్తికి ఉత్పత్తి కేంద్రాలుగా వికసిలుతున్న రాష్ట్ర వర్సిటీలకు రూ.500 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. వెంటనే వర్సిటీలకు అధిక ని ధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టు లను ప్రభుత్వంభర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్షకార్యదర్శులు విఘ్నేశ్, అనిల్,ఉపాధ్యక్షుడు నాగరాజు, మహేశ్,దీపిక,దినేశ్, శివ, పాల్గొన్నారు

తడపాకల్ విద్యార్థులకు బహుమతులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 13: జాతీయ సైన్స్‌డే దినోత్సవాన్ని పురస్కరించుకొని లీలావ తి దవే బాలల సైన్స్ ఫిక్షన్ కథల పోటీలో తడపాకల్ విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా ఇనుప ఇల్లు అనే కథలకు బహుమతులు లభించాయని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13 : ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 16న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను వ్యాపార, వాణిజ్య వర్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీసీ, ఏఐకేఎస్, ఏఐపీఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలిన ఘటనలో ఒకరి మృతి

ధర్పల్లి, ఫిబ్రవరి13: మండలంలోని మైలారం గ్రామంలో రెండు రోజుల క్రితం సిలిండర్ లీక్ అయి పేలిన ఘటనలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రాజన్న (69) రెండు రోజుల క్రితం ఇంట్లో గ్యాస్ లీక్ అయిన విషయం తెలియక బీడీ వెలిగించడంతో ఇల్లు పేలిపోయింది. దీంతో రాజన్న ఆతని భార్యకు తీవ్రగాయాలు కాగా.. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలి

● ఎస్‌హెచ్‌వో రవికుమార్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి13: విద్యార్థులు చదువులో లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థానంలో నిలవాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. మంగళవారం ఆర్మూర్ మండలం చేపూర్ గ్రా మంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈఆర్ ఫౌండేషన్ ప్రారంభం, ఫౌండే షన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడి మేటిరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను జాగ్రత్తగా గమనించాలని, మంచి మార్గంలో నడిచేలా చూడాలన్నారు. ప్రతీఒక్కరికిలో ప్రతిభ ఉంటుందని, ప్రతిభను గుర్తించి వెలికితీస్తే వారు ఆణిముత్యాలుగా తయారవుతారన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వడంలో గురువుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి లాంటి వాటిని దరచేరనివ్వోద్దన్నారు. విద్యార్థులకు ఈఆర్ ఫౌండేషన్ ద్వారా స్టడి మేటిరియల్ అందించడం అభినందనీయమన్నారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయుడు రాందాస్, ఎంఈవో రాజగం గారాం, మాజీసర్పంచ్ ఇందూర్ సాయన్న, హెచ్ఎం చేతనకుమారి, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, అర్గుల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



చేపూర్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభం గరుడ పతావిష్కరణ



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద గరుడ పతావిష్కరణలో భక్తులు

మెండోర, ఫిబ్రవరి13: మండల కేంద్రంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పదోవార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానఅర్చకుడు యాగశాల ప్రవేశం గరుడ పతావిష్కరణ ఎదుర్కోలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారి మేలు కొలుపు త ద్వారా యాగశాల ప్రవేశం చతుస్థనార్చన అగ్నిప్రతిష్ఠ సంతానంలేని వారికి గరుడ ముద్దలు అందజేసి ధ్వజస్తంభం వద్ద గరుడ కల్యాణం, గరుడ పట విష్కరణ పూజ, దేవతాహ్వానం పూజలు నిర్వహించారు. సాయంత్రం మంగళహారతులతో భజన సంకీర్తల్లో గ్రామవీధుల గుండా స్వామివారిని విష్ణుసహస్ర పారాయణం చేస్తూ ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'తెలంగాణ యూనివర్సిటీకి తక్కువ నిధులు కేటాయించడం సరికాదు'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13: రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ యూనివర్సిటీకి తక్కువ నిధులు కేటాయించడంపై పీడీఎస్‌యూ అసహనం వ్యక్తం చేస్తు పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి సోషల్ మీడియా ఇన్‌చార్జి రవీందర్‌లు మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో 15శాతం విద్యారంగానికి కేటాయిస్తామని హామీ ఇచ్చి 8శాతంలోపు బడ్జెట్ కేటాయించడం సరికాదని వర్సిటీల అభివృద్ధి కోసం కేవలం రూ.500కోట్లు కేటాయించడం సరికాదన్నారు. వర్సిటీలో ఖాళీ గా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వర్సిటీలో ఆడిటోరియం, హెల్త్ సెం టర్, మినీ స్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈకార్య క్రమంలో వర్సిటీ పీడీఎస్‌యూ సభ్యులు అక్షయ్, హన్మండ్లు, ఆకాశ్, పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి'

డొంకేశ్వర్, ఫిబ్రవరి13: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని భూములను రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రిలే నిరహర దీక్ష గ్రామస్థులు చేస్తున్నారు. ఈ విషంపై అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించు కోవడం లేదన్నారు. భూమిని కాపాడాలని ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్లామని వాపోయారు. భూమిని కాపాడాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు.అధికారులు ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

సాలూర, ఫిబ్రవరి 13: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు మీసాల నగేష్ అన్నారు. బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5,300 కోట్లకు పైగా స్కాలర్ షిప్స్, ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు రావాల్సిన బకా యిలను అందజేయాలని డిమాండ్ చేశారు.

పాతంగల్‌లో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,ఫిబ్రవరి13: పొతంగల్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా రాత్రి వేళ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీలను సీజ్ చేసిన అధికారులు

ఎడపల్లి, ఫిబ్రవరి 13: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడిచేసి రెండు జేసీబీలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్కఫోర్స్ ఏసీపి శేఖర్ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాత్రి వేలల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో రాణాకలాన్ గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న స్థావరాలపై దాడిచేయగా రెండు జేసీబీలతో మొరం తవ్వకాలు జరుపుతున్న జైతాపూర్ గ్రామానికి చెందిన రాము, మరో ఇద్దరు జేసీబీ డ్రైవర్లను అరెస్టు చేసి రెండు జేసీబీలను, మూడు టిప్పర్‌లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిఐలు అంజయ్య, అజయ్‌బాబులు ఉన్నారు.

సేవాలాల్ జయంతి సందర్భంగా వాలీబాల్ టోర్నీ

సిరికొండ, ఫిబ్రవరి 13: ఈనెల 15న సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు లస్కర్ తెలిపారు. మండలానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడల పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు చందర్, గణేష్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి13: రానున్న లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షులుగా దుగ్గి విజయ్, ఆరే రాజేశ్వర్, దోండి ప్రకాష్, ఎంజె.రమేష్, బోచ్‌కర్ పద్మ, వంగ వీవేక్, దుంపల నగేష్, ప్రధానకార్యదర్శులుగా పొల్కంవేణు, పులి యుగంధర్, కార్యదర్శులుగా ఖాం దేశ్ ప్రశాంత్, శ్రీకుమార్, మిర్యాల్‌కర్ కిరణ్, పల్లె శీను, పడిగెల సురేందర్, చెన్నారెడ్డి, శివగౌడ్, కోశాధికారిగా దన్‌పాల్ శివకుమార్, కార్యవర్గసభ్యులుగా పిట్ల శ్రీధర్, మర్రి రాజు, డల్లీ దేవేందర్, జాగర్ల గంగాధర్‌లను నియామించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి,సీనియర్ నాయకులు కలిగోట గంగాధర్, యామాద్రిబాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. తృటిలో తప్పిన ప్రమాదం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13: బోధన్ పట్టణంలోని పసుపు వాగు వద్ద మంగళవారం రాత్రి లోడ్‌తో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఏం ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో తృటిలో ప్రాణపాయం తప్పినట్లయింది. లారీ బోల్తా పడ్డ విషయం తెలుసుకున్న సీఐ వీరయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై విచారణ చేపడుతున్నామన్నారు. లోడ్‌తో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఎవరికి ఏమి కాకపోవడంతో తృటిలో ప్రాణపాయం తప్పినట్లయిందని బోధన్ సీఐ తెలిపారు.

అయోధ్యకు తరలిన బీజేపీ కార్యకర్తలు

సిరికొండ, ఫిబ్రవరి 13: అయోధ్యలో బాలరాముని దర్శించుకోవడానికి బీజేపీ నాయకు లు, కార్యకర్తలు మంగళవారం అయోధ్యకు తరలివెళ్లారు. మండలానికి చెందిన బీజేవైఎం అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయగౌడ్, సతీష్, మురళి, తదితరులు జిల్లా అధ్యక్షులు దినేష్ ఆధ్వర్యంలో అయోధ్యకు తరలివెళ్లారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో
ఎస్ఆర్ ప్రభంజనం


డి.మనీష్


టి.తేజస్వీ

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతు లమనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకు లు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎస్ఆర్ యాజమాన్యం

జిల్లాలో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 : మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలిచారు. కళాశాలకు చెందిన ఎం.శ్రీవల్లి 99.42 శాతం పర్సంటైల్, కె.శ్రియాష్‌కుమార్ 98.75 పర్సంటైల్, ఎ.మేధన 98.49 పర్సంటైల్, కె.భవ్య 96.12 పర్సంటైల్, బి.చంద్రవర్ధన్ 95.28 పర్సంటైల్, ఆర్.అక్షయ్‌రెడ్డి 95.16 పర్సంటైల్, పి.భావని 94.06 పర్సంటైల్, కె.అఖిల్ 93.63 పర్సంటైల్, కె.వరుణ్ 92.90 పర్సంటైల్, రుషిరాజ్ 91.44 పర్సంటైల్, ప్రవీణ్‌కుమార్ 90.08 పర్సంటైల్, కె.వరుణ్‌కుమార్ 90.06 పర్సంటైల్, బి.అజయ్‌సాయి 90.48 పర్సంటైల్‌లు సాధించినట్లు డీజీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి శ్రీకాంత్, అకాడమిక్ జోనల్ ఇంచార్జి ప్రదీప్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు హన్మంతురావు, అఖేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యం, దేవేందర్‌రెడ్డి, తదితరులు విద్యార్థులను అభినందించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


బర్దిపూర్‌లో కలుష స్థాపన చేస్తున్న వేద బ్రాహ్మణులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని బర్దిపూర్ గ్రామంలో గల హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాల భాగంగా మంగళవారం 3వ రోజు ఆలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకులు రాహుల్ శర్మ, రాజశేఖర శర్మ, ఆధ్వర్యంలో ఆలయంలో సుదర్శన కలుష స్థాపన, హోమం, హారతి మంత్ర పుష్పం,ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విగ్రహాలను రకరకాల పుష్పలతో అలంకరించారు. ఈ నెల 14న ఆలయంలో వసంతి పంచమి పురస్కరించుకొని హరిహరులకు చక్ర స్నానం, పూర్ణాహుతి, కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దేవాలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇద్దరు లైన్‌మెన్ల సస్పెన్షన్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: నందిపేట్‌లో పనిచేస్తున్న ఇద్దరు లైన్‌మెన్‌లను సస్పెండ్ చేస్తూ నిజామాబాద్ డీఈ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన కుద్వాన్‌పూర్ లైన్‌మెన్ వేణుగోపాల్, సీహెచ్ కొండూర్ లైన్‌మెన్ నవీన్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా వీరు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు డీఈ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

'తప్పుడు పద్ధతిలో నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి13: నగరంలో తప్పుడు పద్ధతుల్లో నడుస్తున్న అక్షర గ్రూప్ స్కూల్స్, లండన్‌ప్లే స్కూల్, ఎడిఫై, బ్రైట్ ఫౌండేషన్, కేంబ్రిడ్జ్ ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యు జిల్లా నాయకులు మంగళవారం నిజామాబాద్ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని అక్షర గ్రూప్‌ఆఫ్ స్కూల్ అనే పేరుతో ప్రచారం నిర్వహిస్తు సేయింట్ థెరిస్సా స్కూల్ పేరుతో బోనాఫైడ్ ఇస్తున్నారని, పాత మహ్మదీయ ఫంక్షన్‌హాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎడిఫై స్కూల్ నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఓ కమర్షియల్ బిల్డింగ్‌లో లండన్ ప్లేస్కూల్ పేరుతో పాఠశాల నడుపుతున్నారని ఇలా అనేక పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిపైచర్యలు తీసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో నగర కమిటీ నాయకులు దేవిక,మనోజ్,వంశీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన బీజేపీ నాయకులు

ముప్కాల్, ఫిబ్రవరి13: ముప్కాల్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు మంగళవారం అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. పార్టీలో కష్టపడి వారికి అయోధ్యలోని రాముని దర్శనం చేసుకునేందుకు 20మంది బీజేపీ నాయకులను ఎంపిక చేసిందన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గడ్డంసంతోష్,బీజేవైఎం అధ్యక్షుడు దినేష్, కల్లుస్వామి, నల్లూర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్.. ఒకరికి తీవ్ర గాయాలు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 13: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం శివారులో ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఢీకొందని స్థానికులు తెలిపారు. కామారెడ్డి జిల్లా రెడ్డిపేటకు చెందిన సుధాకర్ బైక్‌పై నిజామాబాద్ నుంచి తిరిగి వెళ్తుండగా డ్రైవర్ వద్ద ప్రయాణికులను దింపడానికి బస్సు ఆపేందుకు ఆకస్మత్తుగా బ్రేకు వేయగా వెనుక ఉన్న ద్విచక్రవాహనం ఢీకొందని, ఈ ప్రమాదంలో బైకు ఉన్న సుధాకర్‌తో పాటు ఆయన పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటన స్థలిని చేరుకున్న డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు.


ధర్మారం శివారులో బస్సును ఢీకొన్న బైక్

క్రీడా మైదానం లేక క్రీడాకారులకు ఇక్కట్లు

● నగరంలో నూతన క్రీడా మైదానం ఏర్పాటయ్యేనా !? ● డీఎస్‌ఏ మైదానాన్నే క్రీడా మైదానంగా చేయాలని క్రీడాకారుల డిమాండ్


జిల్లాకేంద్రంలో క్రీడా మైదానం కోసం వేసిన శిలాఫలకం


నూతన క్రీడా మైదానం పరిస్థితి ఇలా..


డీఎస్ఏ క్రీడా మైదానం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: జిల్లాలో క్రీడాకారులకు క్రీడామైదానాలు లేక క్రీడలు మరు గున పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా క్రీడా మైదానాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. కొన్ని చోట్ల నామమాత్రంగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో అందు బాటులోకి రాలేదు. జిల్లా పరిస్థితి ఇలా ఉంటే జిల్లాకు కేంద్ర బిందువైన జిల్లా కేంద్రంలో క్రీడామైదానం పరిస్థితి మరీదారుణంగా తయారైంది. క్రీడామైదానాలు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ స్థలాల్లో క్రీడలను ఆడుకునే పరిస్థితి ఏర్పడింది. నగరం మధ్యలో డీఎస్‌ఏ మైదానం అందుబాటులో ఉండడంతో గతంలో క్రీడాకారులు ఈ మైదానానికి వచ్చి క్రీడలను ఆడేవారు. ఈ మైదానం కనుమరుగైతే క్రీడల పరిస్థితి దారుణంగా ఉంటుంది. దీంతోపాటు క్రీడలు నేర్పించాల్సిన గురువులు సైతం స్థలాలు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడు తోంది. జిల్లా కేంద్రంలో నగరానికి శివారున స్టేడియాన్ని నిర్మించినప్పటికీ అది క్రీడాకారులకు అందుబాటులో ఉండడం లేదు. నగరానికి దూరంగా ఉండడం క్రీడాకారులకు శాపంగా మారింది. నగరం మధ్యలో పాత కలెక్టరేట్‌లో అందరికి అందుబాటులో డీఎస్‌ఏ మైదానం ఉంది. ఇన్నిరోజులుగా డీఎస్‌ఏ మైదానం అన్ని క్రీడలకు వేదికగా మారింది. గత ప్రభుత్వం పాత కలెక్టరేట్, డీఎస్‌ఏ మైదానంలో కళాభారతి నిర్మించాలని తలపెట్టడంతో క్రీడా మైదానం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కళాభారతి కట్టడం ఒకవైపు జరుగుతున్నా మిగతా స్థలం మొత్తం ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం కూడా మారడం తో మళ్లీ క్రీడా మైదానాన్ని పాత స్థలంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ ఊపందుకుంది. క్రీడ మైదానం కోసం మరో ఉద్యమం చేయాలని క్రీడా సంఘాలు పిలుపునిచ్చాయి.

● క్రీడా మైదానం కోసం గత ప్రభుత్వం స్థలం కేటాయింపు

గత ప్రభుత్వం క్రీడా మైదానం కోసం ప్రెస్‌క్లబ్ ప్రక్కన క్రీడాస్థలాన్ని కేటాయించింది. శాసనసభ ఎన్నికలకు ముందు కోడ్ వస్తుందన్న ఊహాగానాలతో ఆగమేఘాలమీద క్రీడా సంఘాలకు పిలుపులేకుండా శిలాఫలకాన్ని ఆవిష్కరించాయి. కేవలం సుమారు 2ఎకరాల స్థలంలోనే క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించడంతో క్రీడాసంఘాలు అసహనం వ్యక్తం చేశాయి. క్రీడలకు మైదానం ఏమాత్రం సరిపోదనే ఆందోళనలు నిర్వహిం చారు. అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరినా అప్పటి ప్రభుత్వం క్రీడాసంఘాల గోడును పట్టించుకోలేదు. ప్రభుత్వం మారడంతో క్రీడా సంఘాలు సంఘటితమయ్యాయి. అనువైన స్థలమైన డీఎస్‌ఏ మైదానంతో పాటు ఈ స్థలాన్ని కూడా క్రీడా మైదానం కోసం కేటాయించాలని కార్యచరణ రూపొందించారు. క్రీడా మైదానం కోసం ఇదే స్థలాన్ని కేటాయించాలని, లేకపోతే తెలంగాణ ఉద్యమం తరహ ఉద్యమాన్ని నిర్వహిస్తామని క్రీడా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా క్రీడ మైదానంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని క్రీడాభిమానులు, క్రీడాసంఘాలు కోరుతున్నాయి.

క్రీడా మైదానం కోసం మరో ఉద్యమాన్ని చేపడ్తాం



క్రీడా మైదానాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న స్టేడియం నగర శివారున ఉంటే డీఎస్‌ఏ మైదానాన్ని కళాభారతి అంటూ లాగేసుకున్నారు. ఇప్పటికైనా డీఎస్‌ఏ మైదానంతో పాటు పక్కనే కేటాయించిన స్థలాన్ని కూడా క్రీడల కోసం ఉపయోగంలోకి తీసుకురావాలి.

- బొబ్బిలి నర్సయ్య (జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి)

డీఎస్‌ఏ మైదానాన్ని అందుబాటులోకి తేవాలి



నగరంలోని పాత కలెక్టరేట్‌ను ఆనుకొని ఉన్న డిఎస్‌ఏ మైదానం క్రీడాకారులందరికీ అన్నివిధాలా అందుబాటులో ఉంటుంది. చాలా సంవత్సరాలుగా క్రీడాకారులు ఇక్కడనే శిక్షణ పొందుతున్నారు. నగర శివారులో ఉన్న మైదానానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. డీఎస్‌ఏ మైదానంలోనే స్టేడియాన్ని ఏర్పాటు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలి.

- ప్రశాంత్ (కబడ్డీ కోచ్, నిజామాబాద్)

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

● బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా వారివారి గమ్య స్థానాలకు చేర్చాలని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం బోధన్ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పేర్కొన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ప్రయాణికులను గౌరవించాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నియమ నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు.


ఆర్టీసీ సిబ్బందికి అవార్డు అందజేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఎం.వి.ఐ. శోభన్‌బాబులతో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల ఎంపిక

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లాల పురుషుల, మహిళల ఎంపికలను ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగమోహన్, చక్రూ, పింజ సు రేందర్‌లు తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని నవ్యభారతి గ్లోబల్‌స్కూల్‌లో ఈఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను 17,18,19 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో ఉదయం 10గంటల వరకు మైదానికి చేరుకోవాలని తెలిపారు.

నాగేపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్విజ్ పోటీలు

నవీపేట,ఫిబ్రవరి13: మండలంలోని నాగేపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. రాబోయే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవీపేట, ఎడపల్లి, రెంజల్ మండలాలకు చెందిన 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్ర అంశాలపై ఈ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ నాగేపూర్ ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా, సాయినాథ్, లక్ష్మీకాంత్, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీకి స్వాగత సన్మానాలు

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 13: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడిగా నియమింపబడిన తరువాత మహమ్మద్ అలీ షబ్బీర్‌లు మొదటిసారి నిజామాబాద్ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఈనెల 16న స్వాగత సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.16న మధ్యాహ్నం 1గంటకు ర్యాలీ బోర్గాం బ్రిడ్జి వద్ద ప్రారంభమై పులాంగ్ మీదుగా ఆర్‌ఆర్‌చౌరస్తా-నెహ్రూనగర్ పార్కు మీదుగా ప్రగతినగర్‌లోని మున్నూరు కాపు కల్యాణ మండపం వరకు ఉంటుంది. మున్నూరు కాపుకల్యాణ మండపంలో వారికి జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి,బోధన్‌ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేభూపతిరెడ్డి, మాజీఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొంటున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ నగర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

బోధన్ మున్సిపల్ కమిషనర్ బదిలీ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి13: బోధన్‌మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్‌కమిషనర్ ఖమర్ అహ్మద్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో కమిషనర్‌గావిధులు నిర్వహిస్తున్న వెంకటనారాయణ బోధన్‌కు బదిలీపై రానున్నారు.

ఇంటి స్థలాలకు పట్టాలు ఇప్పించాలని ఆర్డీవోకు వినతి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి13: గతంలో కేటాయించిన ఇందిరమ్మ ప్లాట్లకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ బాధితులు ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వేల్పూర్ మండలం కుకునూర్, కోమన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చారు. తమకు 2012 లో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కేటాయించిన ఇందిరమ్మకాలనీపాట్లకు పట్టాలు ఇప్పించాలని వారు కోరారు. సర్వేనెంబర్ 491, 492, 493లో రెండు గ్రామాలకు 80ప్లాట్లు ఇందిరమ్మ గృహపథకంలో కేటాయించారన్నారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి విషయాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం, నాయకులు చొరవ తీసుకొని తమకు కేటాయించిన భూములను లబ్దిదారులకు పట్టాచేసి ఇవ్వాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు రవి,రహీం, గూండ్ల నారాయణ, విజయలక్ష్మీ, భూలక్ష్మీ, రజిత, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు

భగీరథ నీటి లీకేజీతో అంగన్‌వాడీ ప్రాంగణం చిత్తడి

మోస్రా,ఫిబ్రవరి13: మోస్రా మండల కేంద్రంలోని రామాలయం వద్ద గల అంగన్‌వాడీ కేంద్రం వద్ద మిషన్ భగీరథ పైపు లీకేజీ అవుతోంది. కొద్దిపాటిగా ఉన్న లీకేజీ రోజురోజుకు పెద్దగా మారడంతో అధిక మొత్తంలో లీకేజీ ద్వారా తాగునీటి వృథాగా పోతుంది. ప్రస్తుతం నీరు కాలువగా మారి పారుతోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. లీకేజీ నీటితో నీరు కలుషితం అయి రోగాలు ప్రబలే ఆస్కారం ఉంది. వెంటనే లీకేజీకి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో లీకేజీ అవుతున్న నీరు

కలెక్టరేట్ ఏవోకు తాత్కాలిక హెల్త్ సూపర్‌వైజర్ల వినతి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 13: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక హెల్త్ సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న తమను జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో స్టాఫ్‌నర్స్ / ఏఎన్ఎంలుగా కొనసాగించాలని హెల్త్ సూపర్‌వైజర్లు మంగళ వారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. గత ఆరు నుంచి ఎనమిది సంవత్స రాలుగా తాత్కాలిక పద్ధతిన తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్నామని కొత్తగా నియమించ బడ్డ హెల్త్ సూపర్‌వైజర్లు రావడం వల్ల మాయొక్క ఉపాధిని కోల్పోయామని కావున తమను కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఆరోగ్య కేంద్రాల్లో కొనసాగించాలని కోరారు.

మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించండి


సమావేశంలో మాట్లాడుతున్న తుల రాజేందర్

పెద్దబజార్, ఫిబ్రవరి 13: మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని తెలంగాణ చెరకు రైతుల వేదిక కన్వీనర్ తుల రాజేందర్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో చెరకు ఉత్పత్తిదారుల సంఘం, రైతు ఉత్పత్తిదారుల సంఘం, అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద పేరు పొందిన బోధన్ చక్కెర ఫ్యాక్టరీ గత పాలకులు తప్పుడు విధానాల మూలంగానే మూతపడి ఉన్నాయని అన్నారు. ఇది ఫ్యాక్టరీకి 16వేల ఎకరాల విస్తీర్ణం భూమిని నాడు పాలకులు రైతు వ్యతిరేక విధానాల వల్ల ఫ్యాక్టరీ మూతపడటంతో రైతులు ఆ భూములను కోల్పోయారన్నారు. సారంగాపూర్ ఎన్‌సీఎఫ్ సహకార రంగంలో ఉన్న ఏకైక చక్కెర ఫ్యాక్టరీని గత పాలకుల పార్టీల వారు ఆక్రమించుకోవడానికి కుట్ర పన్నుతున్నారని అన్నారు.ఈసమావేశంలో సంఘం కన్వీనర్ ఆకులపాపయ్య, వేల్పూర్ భూమయ్య, దేశెట్టిసాయిరెడ్డి, పృథ్వీరాజ్, నాగయ్య, వినయ్,సంతోష్, గంగాధర్, శ్రీనివాస్, ఖాజామోయినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరిక

పెద్దబజార్, ఫిబ్రవరి 13: నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. 50, 39వ డివిజన్‌ల కార్పొరేటర్లు రాఘవేందర్, నిచ్చెంగి లత మంగళవారం నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి సమక్షంలో కండువా కప్పుకున్నారు. వీరు ఇరువురు కాకుండా గతంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారే మరికొంత మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మరికొందరు పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, బీజేపీ నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, ఆకుల శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,200	రూ.59,200	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లాల్‌సలామ్ (11.45, 3.00)
: బేబి (6.15)
: ఓయ్ (9.50)
స్క్రీన్-2 : ఈగల్ (12.00, 10.00)
: హనుమాన్ (3.20, 6.40)
స్క్రీన్-3 : తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (10.15)
: యాత్ర-2 (1.25, 7.15, 10.20)
: ట్రూలవర్ (4.20)
స్క్రీన్-4 : కెమరామెన్ గంగాతో రాంబాబు (12.25)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (3.40, 6.50, 10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఈగల్ (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : బేబి (1.20)
: అంబాజీపేటమ్యారేజీబ్యాండ్ (4.35)
: సీతారామం (7.30) : యాత్ర-2 (10.35)
స్క్రీన్-3 : ఓయ్ (10.20, 4.35, 10.45)
: సీతారామం (1.30)
: హనుమాన్ (7.45)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : లాల్‌సలామ్ (11.15, 6.15,)
:యాత్ర-2 (2.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్